


# చేపల చెరువు

## అట్లూరు పురుషోత్తం

ఆరోజు సుదినం కాబట్టే నాకు ఆ సాయంత్రం కాకినాడ — తిరుపతి బండి అందింది, అందులో ఒక రెండవ తరగతి పెట్టెలో కిటికీ దగ్గర ఒంటరిగా వున్న సీటు నాకు దక్కింది ఆ విధంగా ఆ రెండవ తరగతి పెట్టెలో నాకు మొదటి తరగతి ప్రయాణీకుని హోదా లభించింది అందుకే అది నాకు సుదినం కాని ఆ పెట్టెలో నా తరువాత ప్రవేశించిన వారందరికీ అది అంత సుదినం అని నేను చెప్పలేను నిజమైన రెండవ తరగతి ప్రయాణీకులు నలుగురు కూర్చోవలసిన బల్లకు ఏడుగురు చొప్పున హాయిగా కూర్చున్నారు మూడవ తరగతి వారు పైనవున్న సామాన్ల చక్కల మీద చెక్కకు నల్గురైదుగురు చొప్పున సర్దుకున్నారు నాల్గవ తరగతి వారు బల్లల మధ్య రెండు కాళ్ళమీద నిలబడ్డారు ఐదవతరగతి వారు ఒంటి కాలిమీద నిలబడి జపం చేస్తున్నారు ఆరవతరగతి వారు పాయిఖానా దొడ్డికి వెళ్లేదారిని మూసివేసారు

మా బండి చీరాలను సమీపించింది రాత్రి తొమ్మిది గంటలైంది నిద్రకు ఆగలేని ప్రయాణీకులు చిత్ర విచిత్రమైన ఆసనాలు వేస్తున్నారు ఒక చిన్నపిల్ల హఠాత్తుగా తన కాలును ఎవరో త్రొక్కారని కెవ్‌మని కేకవేసింది ఆ అమ్మాయి తల్లి గయ్‌మంటూ లేచింది

మా పెట్టె యింత కిక్కిరిసి వున్నా వేరుశనగ కాయలవారు, మసాలావడలవారు, చేకోడీల వారు, పకోడీల వారు, చక్రాల వారు, అందులో ప్రవేశించి సరుకులను కొనే తిరుపతి యాత్రీకులకు కలుగనున్న లాభాలను గురించి సవివరంగా చెప్పుకుపోతున్నారు స్టేషన్ల దగ్గర వేడివేడి టీ కప్పులూ, కాంభోజిరాజు కథల పుస్తకాలూ, తాజా తెలుగునవలలూ, మరుసటి వారం వెలువడనున్న వారపత్రికల సంచికలూ, మా పెట్టెలో ప్రవేశించుతూనే ఉన్నాయి క్లుప్తంగా చెప్పాలంటే, మా పెట్టొక మినీ మార్కెట్, ఒక స్వేచ్ఛావిపణి, ఒక స్వేచ్ఛా ప్రపంచం

అక్కడ అందరూ సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చుకోవచ్చు పిల్లలూ, పెద్దలూ, అందరూ దగ్గవచ్చు, తుమ్మవచ్చు, ఏదైనా విషయం నచ్చనివారు ''ధూ'' అని తమ కాళ్ళదగ్గరే ఉమ్మేయ్యవచ్చు. అందువలనే, ఒక గోదావరి ముసలమ్మ తన చుట్ట కాలేవైపును నోట్లో పెట్టుకుని పొగమేఘాలను బయటకు వదులుతూవుంది మా అందరి కాళ్ళక్రిందా వత్తుగా పేరుకొనివున్న కాగితపు ముక్కలూ, సిగరెట్లపీకలూ, వేరుశనగ తొక్కలూ, బత్తాయి తోళ్ళూ, మట్టిముద్దలూ కలిసి, చిరిగి చిరిగి నేలకు కరుచుకునివున్న రంగురంగుల ఏలూరు తివాచీ ముక్కలవలె అణిగివున్నాయి.

అప్పుడు మా పెట్టెలోకి చీమ కూడా దూరటానికి సందులేదనుకున్నాం అయినా రెండు చేతులు పోయిన ఒక ముసలి తాతా, రెండు కళ్ళూలేని ఒక నడివయసు పురుషుడూ, అతనిని నడిపించుతున్న అతని కుంటి కాలి భార్యా మా అదృష్టాన్ని పొగడుతూ మా మధ్యకు వచ్చారు

''నిజమే మేము అదృష్టవంతులం ఈ దేశాన్ని ఎంతో చీకటి ఆవరించినా, మేము విద్యుద్దీపాల వెలుతురులో ప్రయాణం చేస్తున్నాం'' అని అనుకున్నాం ఇంతలోనే ఓ ముగ్గురు యువకులు, ప్యాంట్లు, స్లాకులు, కళ్ళజోళ్ళు ధరించి పాతిక సంవత్సరాల ప్రాయంలోవున్న ఆముగ్గురు యువకులు, ఎక్కడినుండో అక్కడ వూడిపడ్డారు వారిలో ఒకరి చేతిలో, తళతళలాడుతున్న మూడు క్రొత్త గుడ్డ ముక్కలు వున్నాయి అతను మా బండి ఎలిక్ట్రిక్ ఇంజన్‌వలె, ప్రారంభించుతూనే విజృంభించాడు

''సార్, సార్, మంచి బట్టల బేరం సార్ అతి చౌకబేరం ఈ ఛాన్సుపోతే మళ్ళీ మీకు ఇది తిరిగిరాదు మాకు లాభం అవసరంలేదు మేము కేవలం మా మిల్లు బట్టలను గురించి ప్రచారం చేయటానికే వచ్చాం మీరు ఎంత తక్కువకు పాడినా ఫర్వాలేదు ఈ మూడు ముక్కలనూ, మీరే బెజవాడ మార్కెట్‌లో మూడు వందల రూపాయలకు కొంటారు ఒకటి బొంబాయి షర్టుముక్క, ఒకటి అహమ్మదాబాదు ప్యాంటుముక్క, ఒకటి అమెరికన్ జాకెట్‌ముక్క ముచ్చటగా మూడు ముక్కలు మూడు వందల రూపాయల ఖరీదు గల ముక్కలు సర్కార్ పాట మూడు రూపాయలు సార్ మూడు వందల రూపాయల ఖరీదు గల మూడు ముక్కలూ మూడు రూపాయలే సార్ ఎవరూ పాడటంలేదా? మంచిది సార్ ఇట్లా అయితే మాకు నష్టం వస్తుంది మీకు లాభం క్రింద, మా కంపెనీ పంపిన మంచి బహుమతులను మీకు యిచ్చి, మా బట్టలను మేమే ఉంచుకుంటాం ప్రచారం కొరకు వందలు, వందలు, నష్టపడలేం సార్''

''నాలుగు రూపాయలు''

''ఐదు రూపాయలు''

''ఆరు రూపాయలు''

''ఏడు రూపాయలు''

''మంచిది సార్ ఏడు రూపాయలు, మూడు వందల విలువ గల బ్రహ్మాండమైన మూడు ముక్కలు కేవలం ఏడు రూపాయలు — ఏడు రూపాయలు ఇంకా ఎవరైనా అదృష్టవంతులు ఇక్కడ వుంటే ముందుకు రండి సార్''

''బాబూ, ఒకసారి యిట్లా రా'' అని నేను అతనిని పిలిచి, ''మమ్ములను కొంచెం ప్రశాంతంగా

ప్రయాణం చేయనిస్తావా ?'' అని అడిగాను.

''నిశ్చింతగా ప్రయాణం చేయండి సార్. కాలు మీద కాలు వేసుకొని కూర్చోండి సార్ పేపరు చదువుకోండి మిమ్మల్ని పలకరిస్తే ఒట్టు ''

''మంచిదే నాయనా. కాని, నీ కేకల ధ్వని డీజల్ ఇంజన్ ధ్వనికి మించిపోతే ఎట్లా చెప్పు. ఈ పరిస్థితులలో మేము యీ బండిలో ప్రశాంతంగా ఎలా ప్రయాణం చేయగలం చెప్పు ''

''సార్, సార్, మేమూ ప్రయాణీకులమే సార్ ''

''కాదు మీరు వ్యాపారస్తులు ''

''సార్, మీరు ఎంతో చదువుకున్నవారు మీకు నేను చెప్పదగినవాడిని కాదు కాని, సార్, మనమంతా ప్రయాణీకులమే వ్యాపారస్తులూ, వ్యవసాయదారులూ, ఆఫీసర్లూ, కూలీలూ, మంత్రులూ, తంత్రగాళ్ళూ, సార్, అందరూ ప్రయాణీకులే మనమందరం యీ బండినుంచి, ఎక్కడో ఒకచోట, దిగిపోతాం సార్ ''

''నిజమేనయ్యా ! కాని మేము యీ బండిలో వున్నంతకాలం మమ్మల్ని ప్రశాంతంగా ప్రయాణం చేయనివ్వండి ''

''మీరు ప్రశాంతంగానే వుండండి సార్ మీరు పెద్దవారు చదువుకున్నవారు ఇటువంటి చిల్లర విషయాలలో మీరు జోక్యం పెట్టుకోకూడదు సార్ సార్, మమ్మల్ని కూడ మీరు బ్రతకనివ్వాలి నేను ఇంటర్ తప్పాను ఉద్యోగం లేదు ఈ బట్టలను అమ్మటం తప్ప మరొక పని చేయలేను చూడండి, సార్ ! ఆ ముసలాయన వేరుశనగకాయలు అమ్ముకుంటున్నాడు ఈ కుర్రాడు సిగరెట్లు అమ్ముతున్నాడు ఆ కాకీనిక్కరు ఆయన చీనీ బత్తాయిలు అమ్ముకుంటున్నాడు వాళ్ళను బ్రతకనిచ్చినట్లే, నన్నూ బ్రతకనివ్వండి సార్ ''

''బాగా చెప్పావు బాబూ కాని నువ్వింత గోల చేయకూడదు,

''అట్లా అనకండి సార్ వాళ్ళ బేరం మన పెట్టెను మురికికూపం చేస్తుంది నా వ్యాపారం, మీలాగా పేపర్లు చదవటం చేతగానివారికి, చక్కని కాలక్షేపాన్ని కలుగజేస్తుంది ''

''నువ్వు మంచి గడుసు పిల్లవాడి లాగున్నావయ్యా ! ఈ విధంగా కేకలు వేసి నన్ను చదువుకోకుండా చెయటానికి నీకు హక్కు వుందంటావా ?''

''సార్, సార్, మనకు స్వతంత్రం వచ్చి ముప్పైఐదు ఏళ్ళయిందని మా మాస్టారు చెప్పారు అయినా ఇంకా మనవారిలో నూటికి డెబ్బైమందిని, చదువురాని వాళ్ళుగా వుంచటానికి, మనకు హక్కు వుందంటారా ? ఈ చదువురాని వాళ్ళకు కనీసం కాలక్షేప కార్యక్రమం ఏర్పాటు చేసే హక్కు, నాకు వుంది సార్ ''

''ఓహో ! బ్రహ్మాండంగా వాదించుతున్నావు బాబూ ! నువ్వు, ఇంటర్, బి ఎ లు ప్యాసై, ప్లీడరు కోర్సు చదువ వలసినవాడివి సరేగాని బాబూ, నా ముక్కుకు ముప్పు వాటిల్లినచోట నీ స్వేచ్ఛకు హద్దు ఏర్పడుతుందని ఒక సామెత వుంది అట్లాగే నీ స్వాతంత్ర్యం, ప్రశాంతంగా ప్రయాణం చేయటానికి నాకు గల హక్కును హరించకూడదు ''

# చేపల చెరువు

''ఈ వాదన యిక్కడ చెల్లదు సార్ ఈ రైలులో మీకు పేపరు చదువుకునే హక్కు వుంది పేపరు చదవలేని వాళ్ళకు వేరుశనగ కాయలు తినే హక్కువుంది అమ్మలక్కలూ అరుస్తూ, మూతులు ముడుస్తూ, చేతులను ఊపుతూ మాట్లాడే హక్కు వుంది పోట్లాడే హక్కు కూడా వుంది మాకు బట్టలను వేలం వేసి అమ్ముకునే హక్కు వుంది సార్, ఇది సంపూర్ణ స్వతంత్ర భారతదేశం సార్ సార్ . ఇక నాతో మాట్లాడరా సార్ మంచిది సార్ నా బేరం నేను చేసుకుంటాను అయ్యలారా ! అమ్మలారా ! అదృష్టవంతులారా! నేను మార్కులను అమ్మే గుమాస్తాను కాదు, డిగ్రీలను అమ్మే ప్రొఫెసర్ను కాదు, సంతకాలను అమ్మే ఆఫీసర్ను కాదు, మంచాలను అమ్మే గవర్నమెంట్ డాక్టర్ను కాదు, కాగితాలమీద వంతెనలు కట్టే ఇంజనీర్నుకాదు, ఓట్లను అమ్మే యం ఎల్ ఏ ను కాదు, సీట్లను అమ్మే కాలేజి కమిటీ కార్యదర్శిని కాదు, కాంట్రాక్టులను అమ్మే మంత్రినికాదు, రైల్వేబెర్తులను బ్లాక్‌లో అమ్మే టి టి ఐ నికాదు, ఈబూదిని అమ్మే బాబాను కాదు అదృష్టవంతులారా గమనించండి ! నేను కేవలం చదువుకున్న నిరుద్యోగిని మా మిల్లు బట్టల ప్రచారనిమిత్తం మీకు చౌకగా, అతి చౌకగా, కారుచౌకగా, విక్రయించటానికి వచ్చిన కాన్వాసరును మాత్రమే చూడండి ! ఆలోచించండి ! త్వరపడండి ! రైలు పరిగెత్తుతూ వుంది ఆలసించితే ఆశాభంగం అవుతుంది ! త్వరపడండి ! మూడువందల రూపాయల విలువగల మూడు బంగారం ముక్కలు ఏడు రూపాయలు మాత్రం, ఇంకా ఎవరూ పాడారా ? అయితే ఈ పాటదారునికి మా కంపెనీ బహుమానం ఇస్తుంది ఇదిగో మా కంపెనీ బహుమతి! ఫారిన్ సేఫ్టీరేజర్ బ్లేడ్ ! ఒక ఫారిన్ సేఫ్టీ రేజర్ బ్లేడ్ ! ''

నన్ను ఎవరూబలపర్చలేదు నేను ఓడిపోయాను అతను వేలంపాట సాగిస్తూనే వున్నాడు అదే ముక్కలను మళ్ళీ, మళ్ళీ, వేలంవేసాడు మా బండిది ఎలిక్ట్రిక్ ఇంజన్ కాబట్టి, అది ఒకస్టేషన్ నుండి మరొక స్టేషన్‌కు ఐదు నిమిషాలలో పరుగెత్తి, ప్రతి స్టేషన్‌లోను, పదినిమిషాలనుండి అరగంట వరకూ నిద్రపోతూంది ఈ విధంగా ఎంతసేపు నిద్రించటానికైనా ఈ రైలు బండికి సంపూర్ణ స్వాతంత్ర్యం వుంది

ఆ అబ్బాయి ఆ సరుకును వేలంవేస్తూనే వున్నాడు పాడినవారికి కంపెనీ బహుమతుల క్రింద ఒక బాల్‌పాయింటు పెన్నునూ, ఒకసిరా పెన్నునూ, ఒక దువ్వెననూ, ఒక అద్దాన్నీ ఒక సబ్బునూ, ఈ విధంగా దాదాపు పదిహేను రూపాయల విలువగల బహుమతులను పంచిపెట్టాడు తరువాత పాట అందుకుంది

''తొమ్మిది రూపాయలు''

''ఇరవైరెండు రూపాయలు''

''ఏభైమూడు రూపాయలు''

మా బండి కరవది స్టేషన్‌ను దాటింది

''డెబ్బైఏడు రూపాయలు''

''డెబ్బైఏడు రూపాయలు''

''మూడు వందల రూపాయల సరుకు ఒక వంద కంటె తక్కువకు పోతూవుంది సార్ ! ఒకటోసారి ! రెండోసారి ! మూడోసారి !''

ఆ ముక్కల మూట సామాన్ల చక్కమీద కూర్చున్న ఒకని ఒడిలోకి దూసుకునిపోయింది అతను బిత్తరపోయాడు

''నీ పెన్ను నువ్వు తీసుకో నా దగ్గర అంత డబ్బు లేదు నాతోడు ! నీతోడు ! మా అమ్మతోడు! తిరుపతి వెంకటేశ్వరుని తోడు !''

తరువాత కొంత తర్జన భర్జన జరిగింది సామాన్ల చక్కమీద కూర్చున్న ప్రయాణీకుడు చివరకు ముప్పైఏడు రూపాయలను యిచ్చాడు వెంటనే ఆ ముగ్గురు కళ్ళజోళ్ళ యువకులూ, అతని నుండి ఆ గుడ్డముక్కలను లాక్కొని, మిగతా డబ్బును కట్టి ఆ ముక్కలను తీసుకోమన్నారు

మా పెట్టె అంతా నిశ్శబ్దం ఆ పాటదారు ముఖాన నెత్తురుచుక్క లేదు బండి ఒంగోలును సమీపిస్తూవుంది ఆ ముక్కలను వేలం వేసిన యువకుని పిలిచాను ఆ పాటదారుని కనికరించమని అతనికి సూచించాను

''మీ మాటను కాదంటానా సార్ ? మీరు పెద్దవారు, చదువుకున్నవారు ఈ పది రూపాయలను అతనికి యివ్వండి సార్ మా తాతలు, తండ్రులు, ఏడు తరాలకు కాదుగదా, మూడు తరాలకు సరిపడాకూడ సంపాదించలేదు మాకూ యీ రోజు గడిస్తే చాలు రేపటి సంగతి రేపు ఆలోచించుకుంటాం బండి ఆగుతూ వుంది సార్ ''

ఆ ముగ్గురు కుర్రాళ్ళూ బండి దిగిపోతున్నారు వాళ్ళ నాయకుడిని మళ్ళీ పిలిచాను ఈసారి అతను ప్లాట్‌ఫాంమీద నా కిటికీ దగ్గర నిలబడ్డాడు

''రైలు పెట్టెల్లో ఇటువంటి పనులు ఎంత వరకు న్యాయం బాబూ ?''

''మాస్టారూ, మీరు చేపలను తింటారా ?''

''ఇదేం ప్రశ్న నాయనా ? మోకాలుకీ తలకాయనొప్పి అన్నట్లు, నీ వ్యాపారానికీ, నా ఆహారానికీ, సంబంధం ఏమిటి ?''

''సార్, నా ప్రశ్న అసందర్భంగానే వుంది ఐనా, నన్ను క్షమించి, మీరు సమాధానం చెప్పాలి ''

''నేను చేపలను తింటాను ''

''అవి ఎక్కడ దొరుకుతాయి సార్ ?

''సముద్రాలలోనూ, చెరువులలోనూ ''

''మీరు సరిగ్గా చెప్పారు సార్ మేము సముద్రాలలో చేపలు పట్టలేని కుర్రవాళ్ళం అందుకే యిక్కడ చేపలు పటటానికి వచ్చాం సార్ ''

''బాబూ, ఇది రైలుపెట్టె ''

''ఔను సార్ కాని ఇదే మా చేపల చెరువు ''

''మంచి ఎరగల గాలాన్నే విసిరావు ''

''కాని, ఈరోజున మా అదృష్టం బాగాలేదు సార్ ఎన్నో బొచ్చెలు గల చెరువులో ఒక పక్కె దొరికింది అయినా ఫర్వాలేదు సార్ రేపు మా అదృష్టం పండవచ్చును సార్ బండి కదులుతూ వుంది మళ్ళీ కలుద్దాం నమస్కారం, మాస్టారూ, నమస్కారం '' ★